ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 172
గురువారం 26 డిసెంబర్ 2024 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్
HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## కీలక పోరుకు సిద్ధమైన టీమిండియా

- ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనున్న భరత్
- గెలవడమే లక్ష్యంగా టీమిండియా వ్యూహాలు
- నేటి నుండి మెల్‌బోర్న్ వేదికగా నాలుగో టెస్ట్



07



## పండుగలకు బట్టలు కూడా ఇవ్వలేని కాంగ్రెస్

- హామీల అమలు కాంగ్రెస్ విఫలం
- మహిళలను నమ్మించి మోసం చేసిన రేవంత్‌రెడ్డి
- ఎమ్మెల్సీ కవిత విమర్శ

03



## అక్రమ కేసు పెట్టి జైలుకు పంపారు

- పైశాచిక ఆనందం పొందుతున్న రేవంత్ : నరేందర్‌రెడ్డి

03



03

## కౌశిక్ రెడ్డికి నోటీసు



# మాది పేదల ప్రభుత్వం

ఇందిరమ్మ ఇండ్లలో దళిత క్రైస్తువులకు ప్రాధాన్యం

పేదలకు అనుకూలంగా నిర్ణయాలు



- వందేండ్ల మెదక్ చర్చి గొప్ప ఆలయం
- అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ
- మెదక్ చర్చి క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్
- వనదుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు
- సీఎం వెంట పలువురు మంత్రుల పూజలు

**మెదక్, రోమింగ్‌న్యూస్:** వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు

మిగతా 2 లో



## వాజ్‌పేయికి నివాళి

- 100 నాణెన్ని విడుదల చేసిన ప్రధాని మోదీ
- ఘన నివాళులర్పించిన రాష్ట్రపతి, ప్రధాని ప్రముఖులు

## అబద్ధాల్లో కాంగ్రెస్ పార్టీకే ఆస్కార్ అవార్డ్

- అంబేద్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్
- అంబేద్కర్‌కు భారత రత్న ఇచ్చిందే బీజేపీ
- కాంగ్రెస్‌పై మండిపడ్డ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్



**హైదరాబాద్, రోమింగ్‌న్యూస్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో బీజేపీ పార్టీ ముందుకు కెళ్తుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్ లో వాజ్‌పేయి శతజయంతి వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యం కోసం మాట్లాడటం దారుణమన్నారు.

మిగతా 2 లో



## రేవతి కుటుంబానికి రూ.2కోట్లు

- చెక్కును దిల్‌రాజ్‌కు అందించిన అరవింద్
- ఆస్పత్రిలో బాలుడు శ్రీతేజ్‌కు పరామర్శ

02



## కొండంతా 'భక్త' పరవశమే..!!

క్రిస్మస్ సెలవులలో భారీగా భక్తులు

- ముసురుని సైతం లెక్కచేయక తరలివచ్చిన భక్తజనం
- ధర్మదర్శనానికి 4, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం
- నారసింహుడిని దర్శనానికి క్యూ కట్టిన వీవీపీలు
- పదో రోజుకు చేరిన ధనుర్మాస ఉత్సవాలు
- ఒక్కరోజే నారసింహుడి ఖజానాకు రూ.65.39 లక్షల ఆదాయం

04



## పంచాయతీ ఎన్నికల హడావిడి

- రిజర్వేషన్లపై అభ్యర్థుల్లో గుబులు



**హైదరాబాద్, రోమింగ్‌న్యూస్:** పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దుతో తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. రికార్డుల కు భద్రత లేకుండా పోయింది. భూముల లెక్కాపత్రం లేదు. జమాబందీ వల్ల భూములు, ప్రభుత్వ ఆస్తులకు లెక్క గట్టేవారు. సరిహద్దులు పక్కాగా ఉండేవి. కానీ, అవన్నీ దెబ్బతిన్నా,

మిగతా 4 లో

## రూ.26999కే. ఐఫోన్ 15

- ఐఫోన్ 14ను ఎక్స్‌చేంజ్ తో మీ సొంతం
- ఫ్లిప్‌కార్డు బంపర్ ఆఫర్

**న్యూఢిల్లీ, రోమింగ్‌న్యూస్:** ఐఫోన్.. ఈ పేరు గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. గ్లోబల్ టెక్ దిగ్గజం ఆపిల్ సంస్థకు చెందిన ఐఫోన్లను కొనుగోలు చేయాలని ప్రతి ఒక్కరూ కలలు కంటుంటారు. అయితే, ఆ కలలు అందరికీ నెరవేరవు. అందుకు కారణం సాధారణ ఫోన్లతో పోలిస్తే ఐఫోన్ ధరలు చాలా ఎక్కువగా ఉండడమే. దీంతో కొందరు బెస్ట్ డిస్కౌంట్స్ కోసం ఎదురుచూసి వాటిని సొంతం చేసుకుంటుంటారు. అలాంటి వారికి ఓ గుడ్ న్యూస్. గతేడాది మార్కెట్‌లోకి వచ్చిన ఐఫోన్ 15 (128)పై ప్రముఖ ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఊహించని డీల్‌ను

మిగతా 2 లో



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
26 డిసెంబర్
2024




# అబద్ధాల్లో కాంగ్రెస్ పార్టీకే ఆస్కార్ అవార్డ్

మొదటి పేజీ తరువాయి

అంబేద్కర్ కు అడుగడుగునా అవమానించిన కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్యం కోసం మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. 1954 నుంచి 88 వరకు నెహ్రూ, ఇందిరగాంధీ సహా 21 మందికి భారత రత్న ఇచ్చారని, కానీ అంబే ద్కర్ ను ఎందుకు విస్మరించిందో కాంగ్రెస్పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ మాట్లాడుతూ, అబద్ధాలల్లో కాంగ్రెస్ పార్టీకి అస్కార్ అవార్డు ఇవ్వొచ్చని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న పార్టీ బీజేపీ అని అన్నారు. అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్ అంటూ విమర్శించారు. దేశ ప్రజల స్ఫూర్తి ప్రదాత వాజ్ పేయి అని అంటూ భారత దేశ వైభ వాన్ని, నైతిక విలు వలకు ప్రపంచానికి చాటి చెప్పారన్నారు.. ఆయన ఎప్పుడూ పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పని చేశారని ప్రశంసించారు. ఒక్క ఓటుతో అధికారం కో ల్పోయినా ప్రజాతీర్పు కోరి మళ్లీ అధికారంలోకి వచ్చారన్నారు..ప్రధాని . మోదీ ఆయన ఆశయాలను తూచ తప్పకుండా అమలు చేస్తుంది' అని బండి సంజయ్ అన్నారు.

# అంబేడ్కర్ గురించి మాట్లాడే అర్హత లేదు

## అల్లు అర్జున్ విషయంలో ఏదో మతలబు ఉంది: బండి



**హైదరాబాద్, డిసెంబర్ 25:** అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. 'ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి తాళాలు వేశారు. ఆయన చరిత్ర తెలిపేలా ఉన్న గదుల్లోకి వెళ్లనివ్వడం లేదు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డిఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదు. భాజపా ఒత్తిడి మేరకు గత భారాస ప్రభుత్వం ఆ విగ్రహ నిర్మాణం పూర్తి చేసింది. అంబేద్కర్‌కు సంబంధించిన పంచ తీర్థాలను రాహుల్ గాంధీ దర్శనం చేస్కోవాలి. అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు వస్తున్నాయి. సినీ పరిశ్రమ ఆంధ్రాకు పోవాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారు. ఇండస్ట్రీ ఆంధ్రాకు తరలివెళ్తే తెలంగాణకే నష్టం. మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుకుండా వారి అధిష్ఠానం అదుపులో పెట్టాలని బండి సంజయ్ అన్నారు.

# కేన్-బేట్వా నదీ అనుసంధానం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన మోదీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 25:** కేన్–బేట్వా నదీ అనుసంధానం ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖాండ్వా జిల్లాలో ఏర్పాటు చేసిన ఓంకారేశ్వర్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును కూడా ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. కేంద్ర జలవనరుల మంత్రి సీఆర్ పాటిల్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేన్–బేట్వా నదుల నుంచి తీసుకువచ్చిన నీటి కలశాలను ప్రధాని మోదీకి అందజేశారు. అయితే ఆ కలశాల్లో ఉన్న నీటిని.. ప్రాజెక్టుకు చెందిన నమోనా మోడల్‌పై ప్రధాని మోదీ పోశారు. మధ్యప్రదేశ్‌లోని 10 జిల్లాలకు చెందిన 44 లక్షల మందికి, యూపీకి చెందిన 21 లక్షల మందికి.. నదీ అనుసంధానం ప్రాజెక్టుతో తాగునీటిని అందించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం 44 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. రెండు వేల గ్రామాల్లోని 7.18 లక్షల వ్యవసాయ కుటుంబాలు లబ్ధిపొందనున్నాయి.




# మాది పేదల ప్రభుత్వం



మొదటి పేజీ తరువాయి

నిధులు కేటాయించామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చానని.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చానని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లలో దళిత, గిరిజన క్రైస్తవులకు అత్యధికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10లక్షలకు పెంచామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం వివరించారు. మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏసు భక్తులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. వందేళ్లు పూర్తి చేసుకున్న మెదక్ చర్చి గొప్ప దేవాలయంగా గుర్తింపు పొందిందని తెలిపారు. చారిత్రక చర్చి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. అలాగే మెదక్ చర్చితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తుచేశారు. శతాబ్ది ఉత్సవాలు, భక్తులతో క్రిస్మస్ జరుపుకోవాలనే ఇక్కడకు వచ్చానని తెలిపారు. తమది పేదల ప్రభుత్వమని.. పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో దళితులు, గిరిజనులకు మేలు జరుగుతోందన్నారు.



మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు పొంగులేటి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ పాల్గొన్నారు. కాగా.. మెదక్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ రఘునందన్ రావు తదితరులు వన దుర్గాదేవిని దర్శించుకున్నారు. ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మెదక్ చేరుకున్న సీఎం రేవంత్.. అక్కడ ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మెదక్ చర్చికి చేరుకున్నారు. అక్కడ చర్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆపై అక్కడ నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.



# రేవతి కుటుంబానికి రూ.2కోట్ల సాయం

**హైదరాబాద్, డిసెంబర్ 25:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2కోట్ల సాయం అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన ఈ మేరకు తన నిర్ణయాన్ని ప్రకటించారు. నటుడు అల్లు అర్జున్ తరఫున రూ.కోటి.. పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు అల్లు అరవింద్ అందజేశారు. దిల్ రాజు, పుష్ప 2 నిర్మాత రవిశంకర్‌తో కలిసి అల్లు అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. శ్రీతేజ్‌ను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలుడు తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. అనంతరం అల్లు అరవింద్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. 'శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడని, వెంటిలేషన్ తీసేశారని,. బాలుడు త్వరలోనే మనందరి మధ్య తిరుగుతాడని ఆశిస్తున్నానని అన్నారు. న్యాయపరమైన అంశాల కారణంగా బాధిత కుటుంబ సభ్యులను కలవలేకపోతున్నా. అన్ని రకాల అనుమతులు తీసుకుని శ్రీతేజ్‌ను 10 రోజుల క్రితం పరామర్శించా. ఆ సమయంలో వెంటిలేషన్‌పై ఉన్నాడని అల్లు అరవింద్ తెలిపారు. 'నిన్నటికి, ఈరోజుకి బాలుడి ఆరోగ్యం కాస్త మెరుగు పడింది. అతడి హెల్త్ కండిషన్ బాగుందని వైద్యులు తెలిపారు. బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్, 'పుష్ప 2' నిర్మాతలు, దర్శకుడు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ అడిగాం. సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తాం. హీరోలు, దర్శకులు, నిర్మాతలం కలిసి వెళ్తాం. గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని దిల్ రాజు తెలిపారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ అయినందుకు సీఎంను కలుస్తున్నారా? ప్రభుత్వం, సినీ పరిశ్రమ మధ్య చోటుచేసుకున్న పరిణామాల గురించి వెళ్తున్నారా? అని దిల్ రాజును మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. తాను చిత్ర పరిశ్రమ వ్యక్తినని, ఇండస్ట్రీ–ప్రభుత్వం మధ్య వారధిగా ఉండాలని సీఎం బాధ్యత ఇచ్చారని, అదే చేస్తున్నానన్నారు. అల్లు అర్జున్‌ను కలిశారా అని అడగ్గా ఇంకా లేదని, త్వరలోనే కలుస్తానని చెప్పారు.

# నడ్డా నివాసంలో ఎన్టీఏ పక్షాల భేటీ

**న్యూఢిల్లీ,డిసెంబర్25:** పార్లమెంట్ లోపల, బయటా మిత్రపక్షాల సమన్వయం మరింత పెంచుకోవడంపై ఎన్డీయే పక్షాలు దృష్టి సారించాయి. ఈ మేరకు దిల్లీలో భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఎన్డీయే పక్షాల ముఖ్యనేతలు చర్చలు జరిపారు. ఈ సమావేశానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తెలుగుదేశం అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు, జేడీఎస్ ముఖ్యనేత కుమారస్వామి, ఇతర నేతలు హాజరయ్యారు. అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యల నేపథ్యంలో పార్లమెంట్‌లో రేగిన దుమారం సహా పలు రాజకీయ అంశాలపై ఎన్డీయే నేతలు చర్చించినట్టు తెలిసింది. వాజ్‌పేయీ శత జయంతి వేళ సుపరిపాలన అంశంపైనా నేతలు సమాలోచనలు జరిపారని సమాచారం. జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును ఇప్పటికే జేపీసీకి పంపినందున అక్కడ కూడా సమన్వయం ఆవశ్యకతపై చర్చించినట్టు తెలిసింది. మిత్రపక్షాల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవడం సహా కేంద్ర ప్రభుత్వ పథకాలను లోక్‌సభ నియోజకవర్గాల్లో సమర్థంగా అమలు చేసే అంశాలపై చర్చించినట్టు సమావేశం అనంతరం తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. ఎన్డీయే భేటీ తర్వాత భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సుమారు 15 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఆ తర్వాత నడ్డా నివాసంలోనే కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి.. సీఎం చంద్ర బాబును కలిశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను గట్టెక్కించడంపై చర్చించారు. అనంతరం రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణ వ్.. చంద్రబాబుతో భేటీ అయ్యారు. రైల్వే జోన్ సహా, రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధి అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది. చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నా యుడుతో పాటు పలువురు ఎన్డీయే మిత్రపక్షాలకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సమావేశానికి సంబంధించిన అజెండాను అధికారికంగా ప్రకటించన ప్పటికీ.. సుపరిపాలన, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. ఈ భేటీలో పాల్గొన్నవారిలో జేడీయూ నేత, కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్, అప్నాదళ్ (ఎస్) అధ్యక్షురాలు, కేంద్రమంత్రి అనుప్రియా పటేల్, జేడీఎస్ నేత, కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, హిందుస్థానీ అవామ్ మోర్చా (ఎస్) నేత, కేంద్రమంత్రి జితన్ రామ్ మాంఝీ, ఆర్ఎల్ఎం అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహా, భారత్ ధర్మ జనసేన పార్టీ అధ్యక్షుడు తుషార్ వెల్లప్పల్లి తదితరులు హాజరయ్యారు. మరోవైపు, దేశ వ్యాప్తంగా ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లుల పరిశీలనకు పీపీ చౌధరి సారథ్యంలో ఏర్పాటైన జేపీసీ జనవరి 8న సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రూ.26999కే. ఐఫోన్ 15

మొదటి పేజీ తరువాయి

ప్రకటించింది. రూ.69,990 విలువైన ఈ ఫోన్‌ను రూ.27వేలకే అందిస్తోంది. సాధారణంగా 15 128 ధర రూ.69,990. ఈ ప్రీమియం డివైజ్ ఇప్పుడు పలు డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లను కలుపుకుని కేవలం రూ. 26,999కే ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంది. ఎక్స్ఛేంజ్‌లో గరిష్ఠంగా రూ.31,500 వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని ఫ్లిప్‌కార్ట్ కల్పించింది. అందుకోసం మనం ఐఫోన్ 14ను ఎక్స్ఛేంజ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా చేస్తే ఈ స్మార్ట్‌ఫోన్‌ను రూ. 26,999కే మీ సొంతం చేసుకోవచ్చు. ఎక్స్ఛేంజ్ ఆఫర్ మినహాయింపుతో అయితే గరిష్ఠంగా 16 శాతం తగ్గింపుతో రూ.58,499కు ఫోన్ లభిస్తోంది. అంతేకాదండోయ్.. దీనిపై ఫ్లిప్‌కార్ట్ 'మినిట్స్' డెలివరీ సేవను కూడా అందిస్తోంది. ఎంపిక చేసిన ప్రదేశాల్లో కేవలం 14 నిమిషాల్లోనే ఈ ఫోన్‌ను డెలివరీ చేయనున్నట్లు వెల్లడించింది. అయితే ఇందుకోసం అదనపు ఛార్జీలు వర్తిస్తాయి. ఈ ఆఫర్ డిసెంబర్ 20 నుంచి 25 వరకు మాత్రమే అందుబాటులో ఉంది. నేటితో ఈ ఆఫర్ ముగియనుంది. ఐఫోన్ 15 గతేడాది (2023) సెప్టెంబర్‌లోలో విడుదలైన విషయం తెలిసిందే. బ్లాక్, బ్లూ, గ్రీన్, పింక్, ఎల్లో రంగుల్లో లభిస్తుందీ ఫోన్. ఐఓఎస్ 17 వర్షన్‌పై పని చేస్తున్న ఐ–ఫోన్ 15 ఫోన్.. ఆపిల్ ఏ16 బయోనిక్ చిప్ కలిగి ఉంటుంది. 6.1 అంగుళాల సూపర్ రెటీనా ఎక్స్‌డీఆర్ ఓలెడ్ స్క్రీన్, డైనమిక్ ఐలాండ్ వంటి ఫీచర్లు ఉంటాయి.

# వాజ్‌పేయికి నివాళి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 25:** దివంగత ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయీ 100వ జయంతి ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక నాణేన్ని విడుదల చేశారు. వాజ్‌పేయీ వందవ జయంతి సందర్భంగా రూ.100 స్మారక నాణేన్ని రిలీజ్ చేశారు. అంతేకాకుండా స్టాంప్‌ను కూడా మోదీ విడుదల చేశారు. మరోవైపు వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని సదైవ్ అటల్ స్మారకం వద్ద నేతలు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కడ్, స్పీకర్ ఓం బిర్లా , ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, హెచ్‌డీ కుమార స్వామి ఇతర కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఏపీ సీఎం చంద్రబాబు సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, బీజేపీ నేతలు వాజ్‌పేయికి నివాళి అర్పించారు.

# బౌన్సర్లను పెట్టిందే రేవంత్‌రెడ్డి : రఘునందన్‌రావు

**మెదక్, డిసెంబర్ 25:** బౌన్సర్ల దుకాణం పెట్టిందే రేవంత్ రెడ్డి అని రఘునందన్ రావు పేర్కొన్నారు. ప్రయివేటు బౌన్సర్లను తీసుకువచ్చి నూకిపిచ్చే సంస్కృతి రాష్ట్రానికి తీసుకొచ్చిందే రేవంత్ రెడ్డి. పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు చుట్టూ బౌన్సర్లని పెట్టుకొని జనాలను పక్కకు నూకే కార్యక్రమం మొదలు పెట్టిందే రేవంత్ రెడ్డి. అల్లు అర్జున్ పంచాయితీలో బౌన్సర్లలను ఎందుకు తీసుకొస్తున్నారు? అని రఘునందన్ రావు ప్రశ్నించారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌కు చిత్తశుద్ధి ఉంటే బౌన్సర్ల వ్యవస్థను మొత్తం రద్దు చేయమని చెప్పండి అని ఎంపీ రఘునందన్ రావు సూచించారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

## మాజీ మంత్రి విరసనోళ్ల శ్రీనివాస్ గౌడ్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మాజీ మంత్రి విరసనోళ్ల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫ్యామిలీతో కలిసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం యాదగిరిగుట్టలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో చిక్కులు రాకుండా ప్రభుత్వం పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోర్టుల సాకుతో రిజర్వేషన్లు ఆపి తప్పించుకోవద్దని హితవు పలికారు. తమిళనాడు రాష్ట్రంలో మాదిరిగా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నమైతే ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం జాగ్రత్తలు చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తప్పక అమలు చేయాలన్నారు. కోర్టుల సాకుతో రిజర్వేషన్లు అమలు చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

### యాదగిరిగుట్టను కేసీఆర్ కట్టాడని నిధులు ఆపొద్దు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మాజీ సీఎం కేసీఆర్ పునర్నిర్మించారని నిధులు ఆపొద్దని ప్రభుత్వానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హితవు పలికారు. దేవుడి దగ్గర వివక్ష ఉండొద్దని, సమానత్వం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటి నుండి యాదగిరిగుట్ట ఆలయంలో అభివృద్ధి నిలిచిపోయిందని, వెంటనే నిధులు విడుదల చేసి పెండింగ్ పనులు కంప్లీట్ చేయాలని సూచించారు. ఇక అల్లు అర్జున్ ఎపిసోడ్ దురదృష్టకరమన్న ఆయన.. ఇలాంటి ఘటనలు రిపీట్ కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. సినిమా షూటింగ్ లకు ఏపీ అనుకూలంగా ఉండదని, తెలంగాణ రాష్ట్రమే అన్నింటికీ అనుకూలంగా ఉంటుందన్నారు. ఫిల్మ్ ఇండస్ట్రీ ఏపీకి తరలిపోతుందనే ప్రచారం ఊహాజనితమైందని, ఎట్టిపరిస్థితుల్లో సినిమా పరిశ్రమ హైదరాబాద్ లోనే ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ఉన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**రాజపేట, రోమింగ్ న్యూస్:** రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామంలో క్రిస్మస్ వేడుకలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఫాస్టర్ ఇంజ స్వామీ ఇంజశ్రీ రాములు వినోద్ లు ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ కాల్వపల్లి గ్రామానికి విచ్చేసి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని యేసు దూత అని శాంతి బోధకుడని కరుణామయుడు అనీ ఐలయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల పార్టీ అధ్యక్షులు నమిలే మహేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఇంజ నరేష్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిరివేలు బాలరాజు గౌడ్, విట్టల్ నాయక్, రాంజీ నాయక్, కేదారిగౌడ్, కళ్లెం పాండుగౌడ్, కాల్వపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కాగల శ్రీకాంత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాకర్ల సుధాకర్, పెంట ఆంజనేయులు, పెంట ప్రవీణ్, ఇంజ నరేష్ ,ఇంజ వెంకటేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మాకు అన్ని మతాలు సమానమే...!!

## ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** అన్ని కులాలు, అన్ని మతాలకు చెందిన ప్రజల మద్దతుతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వానికి అన్ని మతాలు సమానమేనని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. బుధవారం యాదగిరిగుట్టలోని గెత్సే ప్రార్థన మందిరంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మనిషి ఎదుటి మనిషి పట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి నిస్వార్థంగా సేవ చేసే గుణం ఉండాలని.. కీడు తలపెట్టిన శత్రువులను సైతం క్షమించే మనస్తత్వం యేసుప్రభువు నుండి నేర్చుకోవాలన్నారు. ప్రేమ, శాంతి ద్వారా అసాధ్యాన్ని సుసాధ్యం చేయొచ్చని నిరూపించిన యేసును స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వానికి మత తారతమ్యాలు లేవని, అన్ని మతాలను సమానంగా చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, మండల నాయకులు హరీష్, హేమేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ గుడ్ల నరేష్ తదితరులు ఉన్నారు.

# జనవరిలో హైదరాబాదులో వేయి గొంతులు... లక్షల డప్పుల భారీ ప్రదర్శన



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మండలం దాతర్పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు లక్ష్మి నారాయణ మాదిగ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ మరియు జిల్లా సీనియర్ నాయకులు బూడిద జానీ మాదిగ లు పాల్గొని వారు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ, మాదిగ ఉప కులాలను జనాభా నిష్పత్తి ప్రకారంగా A B C D లుగా వర్గీకరణ చేయాలనీ 30 సంవత్సరాలనుండి పోరాడుతున్నరని అన్నారు. మంద కృష్ణ మాదిగ చేస్తున్న ఉద్యమలతో సబ్బండా వర్గాల ప్రజలకోసం వృద్దులకు వితంతువులకు మరియు వికలాంగులకు పెన్షన్ సాధించిపెట్టిన ఘనత మంద కృష్ణ మాదిగకే దక్కుతుందన్నారు. చిన్నపిల్లల గుండె జబ్బుల కోసం అప్పుడున్న సీఎం రాజశేఖర రెడ్డి తో కొట్లాడి ఆరోగ్య శ్రీ సృష్టించిది మంద కృష్ణ మాదిగనే అని అన్నారు. జనవరి నెలలో జరిగే హైదరాబాద్ లో వేయి గొంతులు లక్షల డప్పులు భారీ ప్రదర్శన విజయవంతం చేయాలనీ అన్నారు. అదేవిదంగా అన్ని గ్రామాలలో నూతన కమిటీలను వేస్తున్నామన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది

### అధ్యక్షుడిగా బొల్లారం నగేష్ మాదిగ

అధికార ప్రతినిధిగా బొల్లారం యాకుబ్ మాదిగ ప్రధాన కార్యదర్శిగా బొల్లారం మనోహర్ మాదిగ ఉపాధ్యక్షుడిగా బొల్లారం నవీన్ మాదిగ గార్లను నియమించడం జరిగినది ఈ కార్యక్రమంలో నాయకులు మాటూరి మనోజ్ మాదిగ బొల్లారం నాగరాజు మాదిగ మేకల మధు మాదిగ మైనారిటీ నాయకులు MD జంగీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి జిల్లా వాసికి అరుదైన అవార్డు



భువనగిరి, రోమింగ్ న్యూస్: పుడమి సాహితీ వేదిక-మానవ హక్కుల ప్రజా పరిరక్షణ సమితి వారి ఆధ్వర్యంలో పుడమి రత్న జాతీయ విశిష్ట సేవా పురస్కారాలు- 2024 కి యాదాద్రి భువనగిరి జిల్లా ఆకుతోట భావితండకు చెందిన ఎడ్యుకేషనల్ సోషల్ వర్కర్ కే చిరంజీవి లివిద్యారత్న అవార్డుకి ఎంపిక కావడం జరిగింది. డిసెంబర్ 29వ తేదీన అవార్డు ఖమ్మంలో అందుకోబోతున్నారు. ఈ సంవత్సరం వివిధ ఫౌండేషన్ల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు ,కస్తూరిబా స్కూళ్లకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు, మెటీరియల్ వివిధ రకాల సేవ కార్యక్రమం చేయడం వల్ల ఈ అవార్డు వరించింది.

# చౌడూరి నరసింహా రావుకు ప్రపంచ తెలుగు రచయితల మహాసభల ఆహ్వానం




హైదరాబాదు, రోమింగ్ న్యూస్: ఈనెల 28, 29 తేదీల్లో విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు విశిష్ట కవిసమ్మేళన ప్రతినిధిగా నాగోలు వాస్తవ్యులు అఖిల భారతీయ సాహిత్య పరిషత్ పూర్వ జాతీయ కార్యవర్గ సభ్యులు, భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంత గురువందన్ చాత్రాభినందన్ కన్వీనర్, చౌడూరి కళా పీఠం, భారతీయ కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత సంస్కృత విభాగ అధిపతి (కార్పొరేట్ కళాశాలలు), నంది అవార్డు గ్రహీత, ప్రజా కవి కాళోజి జాతీయ ప్రతిభా పురస్కార గ్రహీత, “సాహిత్య కళా విభూషణ” శ్రీ చౌడూరి నరసింహారావుకు ప్రపంచ తెలుగు రచయితల సంఘము నుండి ఆహ్వానం అందింది. గతంలో విజయవాడలో జరిగిన 3,4,5,వ తెలుగు రచయితల మహాసభల్లో పాల్గొని కవి సమ్మేళనాల్లో పాల్గొని తమ కవితలను వినిపించి విశిష్ట కవిగా నిర్వాహకుల చేత సన్మానాన్ని అందుకున్న ప్రతిభావంతులు.

1999 విజయవాడలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ దేవినేని వెంకటరమణ గారి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డును అందుకున్నారు. శ్రీ చౌడూరి అమృత వర్షిణి (కవిత సంపుటి), ఆణిముత్యాలు (వ్యక్తిత్వ వికాస సోపానాలు), నవకవిరత్నాలు (తొమ్మండుగురు ప్రాచీన సంస్కృత కవుల సంక్షిప్త పరిచయ సంపుటి) అనే గ్రంథాలను రచించి ప్రచురించారు. రాష్ట్ర స్థాయ, జాతీయస్థాయి కవిసమ్మేళనాలలో పాల్గొని ఎన్నో కవి సన్మానాలు అందుకున్నారు. ఇటీవల హైదరాబాదులోని రవీంద్రభారతిలో భారత్ కల్చరల్ అకాడమీ, తెలుగు టీవీ రచయితల సంఘం మరియు తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ వారు సంయుక్తంగా నిర్వహించిన ప్రజా కవి కాళోజీ నారాయణరావు స్మారక జాతీయస్థాయి కవితల పోటీలో శ్రీ చౌడూరి కి ప్రథమ బహుమతి తోబాటు శ్రీ కాళోజి జాతీయ ప్రతిభ పురస్కారం లభించింది. వీరి రచనలు అనేక దిన, వార, పక్ష, మాస, త్రైమాసిక పత్రికలు ప్రచురించాయి. అంతేకాక అమెరికా నుండి వెలువడే తానా, ఆస్ట్రేలియా నుండి వెలువడే తెలుగు పలుకు లాంటి విదేశీ పత్రికలు సైతం వీరి రచనలను ప్రచురించాయి. అనేక అవార్డులు, రివార్డులు, పురస్కారాలు, సన్మానాలు, సత్కారాలు శ్రీ చౌధూరిని వరించాయి. ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వానం అందుకున్న శ్రీ చౌడూరిని చౌడూరి కళా పీఠం సభ్యులు, నాగోలుకు చెందిన సాహితీవేత్తలు, ఆయన హితులు, సన్నిహితులు ఆయన ఆహ్వానాన్ని అందుకోవడం పట్ల తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీచౌడూరి మాట్లాడుతూ.. ప్రపంచ తెలుగు మహాసభలకు నన్ను ఆహ్వానించడం పట్ల నాకు ఎంతో ఆనందంగా ఉందని, తప్పనిసరిగా మహాసభల్లో పాల్గొంటానని అన్నారు. ఈ సభలకు తనను ఆహ్వానించిన నిర్వహణ సారధ్య సంఘం గౌరవాధ్యక్షులు శ్రీ మండలి బుద్ధ ప్రసాద్, గౌరవ కార్యనిర్వాహక అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, మహాసభల అధ్యక్షుడు శ్రీ గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి వి పూర్ణచందు గార్లకు శ్రీ చౌడూరు నరసింహారావు తమ కృతజ్ఞతలను తెలియజేశారు.

# గౌరాయి పల్లిలో వాజ్‌పేయి ప్రారంభించిన జీపీలో జయంతి కార్యక్రమం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లిలో మాజీ ప్రధాని, బీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించారు. 1981లో వాజ్‌పేయి ప్రారంభించిన గ్రామపంచాయతీ భవన ప్రాంగణంలో బీజేపీ నాయకులు అటల్ జీ ఫొటోకు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం జీపీ ప్రాంగణంలో కేక్ కట్ చేసి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మైలారుగూడెంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలు జల్లి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించి పలువురికి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. వాజ్‌పేయి తెచ్చిన సంస్కరణల కారణంగానే దేశం ఆర్థికంగా నిలదొక్కుకుని పొరుగు దేశాలకు సవాల్ విసురుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీరా కిషన్ నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు గుంటుపల్లి సత్యం, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# కొండంతా 'భక్త' పరవశమే..!!



**క్రిస్మస్ సెలవులలో భారీగా భక్తులు**

**ముసురుని సైతం లెక్కచేయక తరలివచ్చిన భక్తజనం**

**ధర్మదర్శనానికి 4, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం**

**నారసింహుడిని దర్శనానికి క్యూ కట్టిన వీఐపీలు**

**పదో రోజుకు చేరిన ధనుర్మాస ఉత్సవాలు**

**ఒక్కరోజే నారసింహుడి ఖజానాకు రూ.65.39 లక్షల ఆదాయం**




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి బుధవారం భక్తులు పోటెత్తారు. క్రిస్మస్ సెలవులు రావడంతో.. హైదరాబాద్ సహా రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు యాదగిరిగుట్టకు తండోపతండాలుగా తరలివచ్చారు. ఉదయం నుండి పడిన ఎడతెరిపి లేని ముసురును సైతం లెక్కచేయకుండా భక్తులు రావడంతో.. యాదగిరి కొండ మొత్తం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో కొండ నిండా భక్తజనుల కోలాహలమే కనిపించింది. రద్దీ కారణంగా నారసింహుడి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వెయిట్ చేయాల్సి వచ్చింది. స్వామివారి ధర్మదర్శనానికి 4 గంటలు, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో సొంత వాహనాల్లో రావడంతో.. పార్కింగ్ ప్లేస్ భక్తుల వాహనాలతో నిండిపోయింది. డైవర్షన్ పెట్టి వాహన పూజల ప్రాంగణానికి వాహనాలను తరలించారు. అది సైతం భక్తుల వాహనాలతో నిండిపోవడంతో.. వైకుంఠ ద్వారం నుండి పార్కింగ్ ప్లేస్ సర్కిల్ వరకు రింగు రోడ్డుకు ఎడమ వైపున కిలోమీటర్ల మేర వాహనాలను తాత్కాలికంగా పార్కింగ్ చేశారు. ట్రాఫిక్ కంట్రోల్ చేయడం కోసం ట్రాఫిక్ పోలీసులు, ఆలయ సిబ్బంది నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఇక రద్దీ కారణంగా కొండపైనా, కింద ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, పార్కింగ్ ఏరియా, బస్ బే, క్యూకాంప్లెక్స్, దర్శన, ప్రసాద క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ప్రధానాలయ ప్రాంగణంలో ఎక్కడ చూసినా భక్తుల సందడే కనిపించింది. మరోవైపు ఆలయంలో నిర్వహించిన స్వామివారి నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హెూమంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పలు రకాల పూజలు జరిపించుకుని మొక్కులు చెల్లించుకోవడంతో.. బుధవారం ఆలయ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా బుధవారం ఆలయానికి రూ.65,39,905 ఆదాయం వచ్చింది. ఇందులో అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.21,17,780, వీఐపీ దర్శనాలతో రూ.16.20 లక్షలు, బ్రేక్ దర్శనాల ద్వారా రూ.7,50,600, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.8 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

**నారసింహుడి దర్శనానికి 'క్యూ' కట్టిన వీఐపీలు**

నారసింహుడి దర్శనం కోసం బుధవారం యాదగిరిగుట్టకు పలువురు ప్రముఖులు 'క్యూ' కట్టారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్, ఐఏఎస్ ఆఫీసర్ శశాంక్ గోయల్ వేర్వేరుగా వారి ఫ్యామిలీలతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఈవో భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు.

**పదో రోజుకు ధనుర్మాస ఉత్సవాలు**

యాదగిరిగుట్ట దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు బుధవారంతో పదో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ప్రధానాలయ ఉత్తరం వైపున ఉన్న మండపంలో ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి పాశుర పఠనాలతో తిరుప్పావై పూజలను అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉదయం 5 గంటలకు మొదలైన ఈ పూజల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.









## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్



ఎర్రవెల్లి, రోమింగ్ న్యూస్: క్రిస్మస్ పండుగ సందర్భంగా బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ ను తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. వారికి కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిషప్ నెహేమియా ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. కేసీఆర్ ను కలిసిన వారిలో క్రిస్టియన్ జెఏసి నాయకులు సోలోమన్ రాజు, న్యూ లైఫ్ చర్చ్ స్ బిషనప్ నెహెమియా, క్యాథలిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ లియో లూయిస్ తదితరులున్నారు.

## బీఆర్ఎస్ అనాలోచిత నిర్ణయంతో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తం

**పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, కార్యదర్శి బాలకృష్ణ**

**సీఎం రేవంత్ కు కృతజ్ఞత చెప్తూ యాదగిరిగుట్టలో వీఆర్వోల పూజలు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచితంగా వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో.. రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని 'పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వోలు) సంక్షేమ సంఘం' జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ పేర్కొన్నారు. వీఆర్వోలను తిరిగి రెవెన్యూ డిపార్ట్మెంట్ లోకి తీసుకుంటామనే సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని హర్షిస్తూ.. మంగళవారం యాదగిరిగుట్టలో వైకుంఠ ద్వారం వద్ద పూర్వ వీఆర్వోలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారసింహుడి పాదాల వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాల కారణంగా కుంటుపడిన రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడం కోసం.. గతంలో పనిచేసిన వీఆర్వోలను తిరిగి రెవెన్యూ డిపార్ట్మెంట్ లోకి తీసుకుంటామని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో గ్రామాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గతంలో గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పని చేసిన అందరిని తిరిగి రెవెన్యూలోకి తీసుకోవడానికి ఆప్షన్ కల్పించిన ప్రభుత్వానికి ఎప్పటికీ కృతజ్ఞులమై ఉంటామన్నారు. తమను తిరిగి రెవెన్యూ డిపార్ట్మెంట్ లోకి తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు గతంలో వినతిపత్రం ఇచ్చినప్పుడు కచ్చితంగా అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారని.. హామీని నిలబెట్టుకుంటూ వీఆర్వోలను రెవెన్యూ డిపార్ట్మెంట్ లోకి తీసుకోవాలని అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి వీఆర్వోలను తిరిగి రెవెన్యూలోకి తీసుకోవడానికి సహకరించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ధన్యవాదాలు చెప్తున్నామని తెలిపారు. అలాగే వీఆర్వోలను రెవెన్యూలోకి తీసుకునేలా కృషి చేసిన జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గరిక ఉపేందర్ కు ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట నరసింహారెడ్డి, వీఆర్ఏల సంఘం రాష్ట్ర నాయకురాలు రెడ్డి ఝాన్సీ రాణి, కవిత, మండల నాయకులు కృష్ణ, నరసింహ, సురేష్, ఎస్కే అహమ్మద్, యాదగిరి, అజ్మత్ పాషా, ఇస్తారి, నరసింహ, శంకర్, పద్మ, శిరీష, మాధవరెడ్డి, శంకర్ తదితరులు ఉన్నారు.

## నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనం అటల్ జీ.

**వాజపేయి 100వ జయంతి సందర్బంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి వారికి వస్త్రాలు పంపిణీ చేసిన బీజేపీ నేత బేతి మహేందర్ రెడ్డి.**



కరీంనగర్, రోమింగ్ న్యూస్: నైతిక విలువలకు కట్టుబడి దేశ భద్రతను, సంక్షేమాన్ని, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్లడడమే కాకుండా స్వపక్షం, విపక్షాలకు ఆదర్శప్రాయుడు మన మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ అటల్ బిహారి వాజపేయి 100వ జయంతి సంధర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి కొనియాడారు. డిసెంబర్ 25, బుధవారం రోజున వాజపేయి గారి చిత్రపటానికి నివాళులు అర్పించడమే కాకుండా కరీంనగర్ నగరపాలక సంస్థ 40వ డివిజన్ లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను శాలువాతో సన్మానించి వారికి పాంట్స్, షర్టులతో పాటు మహిళ కార్మికులకు చీరలు పంపిణి చేసిన అనంతరం స్వీట్లు పంపిణీ చేయడం జరిగిందని బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. అలాగే వాజపేయి గారి 100వ జయంతి ఉత్సవాలను సంవత్సరం పాటు జరుపుకోవాలని బీజేపీ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లాలోని వార్డులు, గ్రామాలు, మండలాల పరిధిలో చెడు వ్యర్థాలను, వాసనలను భరిస్తూ తమ ప్రాణాలకు తెగించి పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను స్థానిక బీజేపీ కార్యకర్తలు, నాయకులు అన్ని రకాలుగా ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నేత బేతి మహేందర్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు బేతి సుమలత, కట్ట సాయికృష్ణ, వావిలాల రోహిత్ రెడ్డి, ఉమ్మెంతుల శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎడ్ల రత్నాకర్ రెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
26 డిసెంబర్
2024





# ప్రేమించండి.. ఉపకారం చేయండి



**సిద్దిపేట, డిసెంబర్ 25:** ఏసుక్రీస్తు ప్రబోధించిన ప్రేమ, కరుణ, శాంతి ఇతరుల పట్ల చూపించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. సిద్దిపేటలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏసు క్రీస్తు జన్మించిన డిసెంబర్ మాసం వచ్చిందంటే క్రైస్తవులందరికీ సంతోషంగా ఉ ంటుందని అన్నారు. ఈ క్రిస్మస్ మనందరికీ శాంతిని, సౌభ్రాతృత్వాన్ని, సహనాన్ని, క్షమాగుణాన్ని నేర్పుతుందని పేర్కొన్నారు. ఎదుటివారి పట్ల జాలి, దయ, క్షమాగుణం కలిగి ఉ ండాలని ఏసుక్రీస్తు ప్రబోధించారని హరీశ్‌రావు అన్నారు. తోటివారిని ప్రేమించండి.. తోటి వారికి ఉపకారం చేయండి.. పది మందికి సహాయం చేసినపుడే నీ జన్మ ధన్యమవుతుందని ప్రభువు చెప్పారని తెలిపారు. తనను శిలువ వేసిన వారిని, తనను నానా మాటలు అన్నవారిని కూడా క్షమించండి అన్న గొప్ప దయామయుడు ఏసు క్రీస్తు అని కొనియాడారు. అందుకే ఏసుక్రీస్తు గొప్పతనాన్ని ప్రపంచమంతా గుర్తించిందని అన్నారు. దేశంలో క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా జరిపిన ఒకే ఒక ముఖ్యమంత్రి కేసీఆర్ అని హరీశ్‌రావు కొనియాడారు. క్రిస్మస్ తెల్లవారి బాక్సింగ్ డే రోజు కూడా కేసీఆర్ సెలవుగా ప్రకటించారని గుర్తుచేశారు. బతుకమ్మ పండుగకు హిందువులు, రంజాన్ పండుగకు ముస్లింలు, క్రిస్మస్ పండుగకు క్రైస్తవులు కొత్త బట్టలతో ఉండాలని కేసీఆర్ పదేళ్లపాటు తోఫాను అందించారని తెలిపారు. కానీ, దురదృష్టవశాత్తు ఇప్పుడున్న ప్రభుత్వం ఆ తోఫాలను కొనసాగించకుండా ఆపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మీ అందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరియాలని, మీ కోరికలు, కలలన్నీ నిజం కావాలని ఆకాంక్షిస్తున్నానని హరీశ్‌రావు అన్నారు. మీ భవిష్యత్తు బంగారుమయం కావాలని, ఉజ్వలంగా ఉ ండాలని ఆ ఏసు ప్రభువును మనసారా ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఏసు ప్రభువు చెప్పిన విషయాలన్నింటినీ మనం జీవితంలో ఆచరించాలన్నారు. అప్పుడే అప్పుడే ఏసు ప్రభువు పట్ల మనం నిజమైన భక్తి చూపిన వారమవుతామని పేర్కొన్నారు.

# ఏసుక్రీస్తు మార్గంలో పయనించాలి : జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట, డిసెంబర్ 25:** ఏసుక్రీస్తు చూపిన మార్గంలో అందరూ పయనించి ప్రేమ, కరుణ ఇతరుల పట్ల చూపించాలని, అందరి ప్రార్థనలు ఫలించి ప్రశాంతంగా జీవించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నిర్మల మాతా చర్చ్, సిల్వి సిలోయం చర్చ్, గ్రేస్ చర్చ్, మన్నా చర్చ్, సెయింట్ బాప్టిస్ట్ చర్చిలలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని మతాల ప్రధాన పండగలను అధికారికంగా నిర్వహిస్తూ వాటి ప్రాధాన్యత పెంచిన ఘనత కేసీఆర్‌దే అని స్పష్టం చేశారు. గత పదేండ్లుగా ఆయా మతాల ప్రధాన పండుగలను అధికారికంగా నిర్వహించుకుంటూ మరింత ఐక్యతను పెంచుకున్నామన్నారు. క్రిస్మస్, రంజాన్, దసరా పండుగలకు ప్రత్యేక విందులు, దుస్తులు, సామాగ్రిని పంచుతూ గంగా, జమున, తహజీబ్‌లకు నిలయంగా తెలంగాణ సమాజాన్ని తయారు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని మతాల ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండి తెలంగాణ సమాజం మరింత అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమల్ల అన్నపూర్ణ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా



గ్రంథాలయ సంస్థ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, నాయకులు నంద్యాల దయాకర్ రెడ్డి, ఉప్పల ఆనంద్, మారుపెద్ది శ్రీనివాస్ గౌడ్, నెమ్మది బిక్షం, జీడీ భిక్షం, తూడి నరసింహారావు, పూర్ణ శశికాంత్, తాహెర్ పాషా, బత్తుల జానీ, గండూరి కృపాకర్‌లతో పాటు ఆయా చర్చిల పాస్టర్లు, ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రేమ వేధింపులకు యువతి బలి

### యాసిడ్ తాగి బలవన్మరణం

**హైదరాబాద్,డిసెంబర్25 :** హైదరాబాద్ జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. ప్రేమ వేధింపులు తట్టుకోలేక యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డిగ్రీ విద్యార్థిని చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. న్యూ భవానీ నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థిని పూర్ణిమ.. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి రాగానే యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ప్రేమ పేరుతో నిఖిల్ అనే యువకుడు వేధిస్తున్నాడని, అతని వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు ఆరోపించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జవహర్‌నగర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాన్ని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన కుటుంబసభ్యులు.. ఆందోళనకు దిగారు. తమ కుమార్తె మరణానికి కారణమైన యువకుడిని ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు.

### ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

# ముగ్గురు మృతి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 25:** ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నైనిటల్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు లోయలో పడింది . ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. బస్సు 27 మంది ప్రయాణికులతో అల్మోరా నుంచి హల్ద్వానీకి వెళ్తోంది. భీమ్‌తల్ నగర సమీపంలోని రాగానే బస్సు ఓ వంపు వద్ద అదుపుతప్పి 1,500 అడుగుల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. సుమారు 24 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 15 అంబులెన్స్‌లు ఘటనాస్థలికి చేరుకొన్నాయి. క్షతగాత్రులను రోప్‌ల సాయంతో రక్షించి ఆసుపత్రికి తరలించారు.



# కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి

**అమరావతి, డిసెంబర్ 25:** భవానీ దీక్షల విరమణ చివరి రోజు కావడంతో విజయవాడలోని ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. బుధవారం తెల్లవారుజాము నుంచే భవానీ భక్తులు కృష్ణానది ఒడ్డున స్నానం ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్ని క్యూలైన్‌లల్లో ఆలయ అధికారులు భక్తులకు ఉచిత దర్శనం కల్పించారు. క్యూలో నిలుచున్న భక్తులకు 2 నుంచి 3 గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు వివరించారు. అమ్మవారి దర్శనం అనంతరం భవానీ ఘాట్, పున్నమి ఘాట్, సీతమ్మవారి పాదాల సమీపంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక కేశఖండన శాల వద్ద దీక్షాదారులు తలనీలాలు సమర్పించుకున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా నుంచి భవానీలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. భవానీ దీక్షాదారులు వయసుతో తారతమ్యం లేకుండా ఏడు కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేశారు. భవానీలతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. ఆలయ ఈవో రామారావుతో పాటు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, సంబంధిత శాఖల అధికారులు సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి భక్తుల రద్దీ, దర్శనాలు, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 21న ప్రారంభమైన దీక్షల విరమణ బుధవారంనాటితో ముగుస్తుంది.

# కావాలనే బీజేపీ కుట్రలు చేస్తుంది : అతిషి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 25:** కావాలనే బీజేపీ కుట్రలు చేస్తుందని, పత్రికల్లో వచ్చిన పబ్లిక్ నోటీసులు తప్పుడువని, అదంతా బీజేపీ కుట్ర అని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి అన్నారు. ఆప్ ప్రభుత్వాన్ని బ్లేమ్ చేయడం కోసం బీజేపీ నేతలు కొంతమంది అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ పబ్లిక్ నోటీస్‌లు వచ్చేలా చేశారని ఆమె ఆరోపించారు. మహిళా సమ్మాన్ యోజన, వృద్ధులకు ఉచిత వైద్యం అందించే సంజీవని యోజన పథకాలను నోటిఫై చేయలేదని ఇవాళ ఢిల్లీ ప్రభుత్వం పబ్లిక్ నోటీస్ రిలీజ్ చేసింది. ఆ నోటీస్ ఢిల్లీలోని అన్ని ప్రధాన పత్రికల్లో అచ్చయ్యింది. దాంతో ఎన్నికల్లో ఓట్ల కోసం హామీలు ఇచ్చిన కేజ్రీవాల్.. ఇప్పుడు వాటిని తుంగలో తొక్కుతున్నారని, మహిళా సమ్మాన్ యోజన పథకాన్ని నోటిఫై చేయలేదని ఆప్ సర్కారు పబ్లిక్ నోటీస్ ఇవ్వడం ద్వారా ప్రజలకు ఇచ్చిన మాట తప్పిందని బీజేపీ నేతలు విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఢిల్లీ సీఎం అతిషి స్పందించారు. బుధవారం వార్తా పత్రికల్లో అచ్చయిన పబ్లిక్ నోటీస్‌లు తప్పుడువి. బీజేపీ నేతల ఒత్తిడి మేరకు ప్రభుత్వంలోని కొందరు అధికారులు ఆ నోటీస్‌లు ఇచ్చారు. ఇదంతా బీజేపీ కుట్ర. ఈ తప్పుడు నోటీస్ ఇచ్చిన అధికారులపై పాలనా యంత్రాంగం, పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారు. మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన పథకాలు ఇప్పటికే ప్రజా బాహుళ్యంలోకి వెళ్లాయి. వాటిని కచ్చితంగా అమల్లోకి తీసుకొస్తాం' అని సీఎం అతిషి హామీ ఇచ్చారు.

### నాపై అక్రమంగా కేసు పెట్టి

# జైలుకు పంపారు

### పైశాచిక ఆనందం పొందుతున్న రేవంత్ : నరేందర్‌రెడ్డి



**హైదరాబాద్,డిసెంబర్ 25 :** కావాలనే సీఎం రేవం త్‌రెడ్డి తనపై అక్రమంగా కేసు పెట్టి జైలుకు పంపించా రని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి విమర్శించారు. లగచర్ల దాడి ఘటనలో తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని మండిపడ్డారు. 37 రోజులు జైల్లో పెట్టి రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందారని అన్నారు. లగచర్ల ఘటనలో కేటీఆర్ ను కూడా ఇరికించే ప్రయత్నం చేశారని పట్నం నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఓట్లు వేసి గెలిపించిన రైతులకు బేడీలు వేసిన ఘనత రేవంత్ రెడ్డిదే అని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలని రేవంత్ రెడ్డికి సూచించారు. రైతుబంధుపై పెద్ద పెద్ద మాటలు చెప్పి మాట తప్పారని రేవంత్ రెడ్డిని పట్నం నరేందర్ రెడ్డి విమర్శించారు. అల్లు అర్జున్ అంశంపై గంటసేపు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాట్లాడారని పేర్కొన్నారు. కానీ రైతుల సమస్యలపై మాట్లాడమంటే సభను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు



**హైదరాబాద్, డిసెంబర్ 25:** హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి బంజారాహిల్స్ పోలీసులు నోటిసులు ఇచ్చారు. గురువారం ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. బంజారాహిల్స్ సీఐ విధులకు ఆటంకం కలిగించారనే కేసులో విచారణకు హాజరుకావాలని ఈ నోటీసులిచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఈ నెల 4వ తేదీన బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు 20మంది అనుచరులపై సైతం కేసు నమోదైంది. విధులను అడ్డగించడంతో పాటు బెదిరింపులకు దిగారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డి కలిసి తన ఫోన్‌ని ట్యాప్ చేస్తున్నారని.. వీరిద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదు చేసేందుకు ఈ నెల 4వ తేదీన పాడి కౌశిక్ రెడ్డి పీఎస్‌కి వెళ్లారు. బంజారాహిల్స్ ఏసీపీకి ఉదయం ఫోన్ చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు రమ్మన్నారని.. తాను స్టేషన్‌కు వెళ్లేకన్నా ముందే ఏసీపీ వెళ్లిపోయారని.. సీఐ సైతం వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తే తనతో పార్టీ కార్యకర్తలు ప్రశ్నించానని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తాను ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా సీఐ ప్రవర్తించారని.. డీజీపీ కన్నా ఎక్కువ ప్రోటోకాల్ ఎమ్మెల్యేకు ఉంటుందని .. పదవులు లేని సీఎం సోదరులకు పోలీసులు వంగి వంగి దండాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హామీల అమలు కాంగ్రెస్ విఫలం

### మహిళలను నమ్మించి మోసం చేసిన రేవంత్‌రెడ్డి

### పండుగలకు కనీసం బట్టలు కూడా ఇవ్వలేని కాంగ్రెస్ : ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, డిసెంబర్ 25:** ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలను నమ్మించి మోసం చేసిందని కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ ఎగిరిపోయాయని ఆమె ఎద్దేవా చేశారు. మెదక్ చర్చిని సందర్శించిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని సీఎం ప్రకటిస్తారని మహిళలకు ఆశించారు. కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటన చేస్తారని ఊహించారు. కానీ ప్రభుత్వం ఎటువంటి ఆలోచన చేయడం లేదు. రాష్ట్రంలోని ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ. 30 వేలు బాకీ పడింది. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇవ్వలేదు. తక్షణమే స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 శాతం నేరాలు పెరిగాయి. నేరాల పెరుగుదల.. ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సోయి ప్రభుత్వానికి లేదు. మహిళలు చూస్తూ ఊరుకోబోరు.. కచ్చితంగా ప్రశ్నిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టింది. తక్షణమే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి. రైతు భరోసా కింద అర్హులను తగ్గించే ప్రయత్నం చేయవద్దు. కేంద్ర ప్రభుత్వపు నిబంధలను అమలు చేస్తే 30 శాతం రైతులకు కూడా రైతు భరోసా రాదని కవిత పేర్కొన్నారు. మొక్కజొన్నలు, కందులు, సోయాబీన్, పత్తి వంటి పంటలను మద్దతు ధరను పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైంది..? ఏడాది కాలంగా ఏ ఒక్క పంటకు మద్ధతు ధర ఇవ్వడం లేదు. చక్కెర ఫ్యాక్టరీలను ఎప్పుడు ఓపెన్ చేస్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సిందే. తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని కవిత డిమాండ్ చేశారు. తెలంగాణకు తలమానికం మెదక్ చర్చి. బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు క్రైస్తవులకు పేగుబంధం ఉంది. తెలంగాణ కోసం ప్రార్థన చేయని చర్చి లేదు. మత సహనానికి నిదర్శనం మెదక్. మెదక్ జిల్లాను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. కేసీఆర్ గోదావరి జలాలతో సింగూరును నింపారు. మెదక్‌కు నీళ్లు వచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను ప్రభుత్వం నిలిపివేడయం దారుణం. కేసీఆర్‌పై కోపాన్ని మెదక్ ప్రజలపై తీర్చుకుంటే ఏమొస్తుంది..? కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను కొనసాగించాలి అని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

# రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి : శ్రీనివాస్‌గౌడ్

**యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 25:** కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రైతు బంధు అమలుపై స్పష్టమైన హామీని నిలబెట్టుకోవాలి. యాదాద్రికి రాగానే రైతు బంధు హామీ గుర్తుకువస్తుంది. గ్రామాల వారిగా కలెక్టర్ నుంచి పూర్తి స్థాయి నివేదిక తీసుకురావాలి. జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి. అప్పుడే ఎన్నికలకు వెళ్ళాలి. న్యాయ పరమైన చిక్కులకు ప్రభుత్వమే బాధ్యత వ్యవహరించాలి. రూపాయి ఖర్చు లేని హామీ రిజర్వేషన్ అమలు చేయాలి అని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్యంకొండ వద్ద రోప్ వే, సకల వసతులు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలి. టెంపుల్ సిటీలో 200 ఎకరాలు గతంలోనే కేటాయించాం. టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ కింద రూ. 2 కోట్లు కేటాయించాం. సినీ పరిశ్రమ తరలిస్తే ఊరుకోం. సంధ్య థియేటర్‌లో జరిగిన ఘటనపై బాధితులకు న్యాయం చేయాలి. రేపు వచ్చేది మా ప్రభుత్వమే, అన్నివిధాలా ఆదుకుంటాం. రియల్ ఎస్టేట్ వ్యాపారం కేసీఆర్ హయాంలో పుంజుకుంది.. ఇప్పుడు కుదేలైంది అని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
26 డిసెంబర్
2024





# పంచాయతీ ఎన్నికల హడావిడి

## రిజర్వేషన్లపై అభ్యర్థుల్లో గుబులు

**హైదరాబాద్, డిసెంబర్ 25:** గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. మరోవైపు పంచాయతీ రిజర్వేషన్లు స్థానిక పార్టీ నేతలను టెన్షన్ పెడుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరితో సర్పంచ్ పదవీ కాలం ముగియగా అప్పటి నుంచి పల్లెల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన నడుస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో యంత్రాంగంతో పనులు చేయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కూడా పంచాయతీ ఎన్నికలకు రెడీ అయింది. బీసీ రిజర్వేషన్ పెంచడానికి కులగణన చేపట్టి బీసీ కమిషన్, డెడికేటెడ్ కమిషన్ను అపాయింట్ చేసింది. ప్రతి పనీ పార్టీలకు తెలిసేలా పారదర్శకంగా చేస్తున్నారు. నోటిఫికేషన్ వచ్చే టైంకు అన్నీ సిద్ధం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇసి అందుతున్న ఆదేశాలను ఎప్పటికప్పుడు గ్రౌండ్‌లో అమలు చేస్తూ రిపోర్టు పంపుతున్నారు. రిజర్వేషన్‌లు ఎలా ఉంటాయోనని రాజకీయ పార్టీల్లో చర్చ జరుగుతోంది. పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికలు పేపర్ బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తారు. బ్యాలెట్ పూపర్ పై సింబల్స్ మాత్రమే ఉంటాయి. వాటిపై పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఉండవు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులే తమకు కేటాయించిన గుర్తులు ప్రచారం చేసుకుంటారు. నిబంధనలను అను-సరించి ఇప్పుడు మొత్తం 30 గుర్తులతో బ్యాలెట్‌లు రూపొంద నున్నాయి.




గత ఎలక్షన్‌లో బ్యాలెట్‌పేపర్ల కోసం ఉపయోగించిన బాక్స్‌ల రిపేర్లకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జడ్పీ ఆఫీస్?లో భద్రపర్చిన పోలింగ్?బాక్స్ ల్లో అదనంగా ఉన్నవాటిని వారం కింద పొరుగు జిల్లాలకు తరలించారు. పెంచిన15 గ్రామ పంచాయతీలు కలిపి జిల్లాలో మొత్తం 545 పంచాయతీలు, 5,022 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. ఓటర్లుగా 8,30,580 తేలారు. వారిలో పురుషులు 3,87,017, మహిళలు 4,43,548, ఉ న్నారు. ప్రతి 600 మందికి ఒక పోలింగ్ సెంటర్ చొప్పున మొత్తం 5,053 సెంటర్లను ప్రకటించారు. ఆ లిస్టును ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ఆఫీసుల్లో అంటించారు. ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సౌకర్యాలు కల్పిస్తారు.


# మళ్లీ గ్రామ రెవెన్యూ వ్యవస్థ

## భూభారతి చట్టానికి శ్రీకారం

## వీఆర్‌వో, వీఆర్ఏలతో గాడిన పడేనా?




**హైదరాబాద్, డిసెంబర్ 25:** పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దుతో తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. రికార్డులకు భద్రత లేకుండా పోయింది. భూముల లెక్కాపత్రం లేదు. జమాబందీ వల్ల భూములు, ప్రభుత్వ ఆస్తులకు లెక్క గట్టేవారు. సరిహద్దులు పక్కాగా ఉండేవి. కానీ, అవన్నీ దెబ్బతిన్నా, వాటిని రక్షించే ప్రయత్నం చేయడం లేదు. కెసిఆర్ హయాంలో విఆర్‌వో వ్యవస్థ రద్దుతో ఉన్నది కూడా మాయం చేశారు. దీంతో తెలంగాణలో భూదోపిడీ కేసులు పెరిగాయి. ప్రభుత్వ, దేవాదాయ, అసైన్డ్ భూములు మాయమయ్యాయి. దీనికి సమాధానం చెప్పకుండా ధరణి పేరుతో మరింతగా దోపిడీ చేశారు. ఈ క్రమంలో మళ్లీ గ్రామీణ రెవెన్యూ వ్యవస్థకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టబోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ధరణిని రద్దు చేస్తూ భూ భారతి చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టంలో భాగంగా వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెవెన్యూ శాఖలో సంస్కరణల పేరిట వీఆర్‌ఏ, వీఆర్వో లాంటి కీలక వ్యవస్థను రద్దు చేసింది. వాటి స్థానంలో ధరణి పోర్టల్ తీసుకొచ్చి భూములకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసి రిజిస్ట్రేషన్లు కొనసాగించారు. ఆ సమయంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలను ఇతర శాఖలకే కేటాయించారు. ఆ సమాచారాన్ని సేకరించి అర్హత ఉన్న ఉద్యోగులను తిరిగి వీఆర్‌ఏ, వీఆర్వోలుగా విధుల్లోకి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిసెంబర్ 28 నెలలోగా అందుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి పెట్టాలని తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ సోమవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో మొత్తం 10,911 వరకు రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న వీఆర్‌ఏ, వీఆర్వోలను ఇతర శాఖల్లోకి బదిలీ చేశారు. వారిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు మొదలైంది. వారికి తిరిగి వీఆర్‌ఏ, వీఆర్వోలుగా పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది. లేకపోతే రెవెన్యూ శాఖలో కాంగ్రెస్ ప్రభుత్వం వేరే ఏదైనా కొత్త పేరుతో వారికి తిరిగి రెవెన్యూ అధికారులుగా పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. డిగ్రీ అర్హత ఉన్న మాజీ వీఆర్‌ఏ, వీఆర్వోలను రెవెన్యూ శాఖలో గతంలో నిర్వహించిన విధులు అప్పగించనున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వీఆర్వో వ్యవస్థను పునరుద్ధించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక వీఆర్వో అధికారిని నియమించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాంతో పాత ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 28 వరకు వీఆర్వోలు, వీఆర్‌ఏల పునరుద్ధరణకు గడువు విధిస్తూ తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్వో, వీఆర్‌ఏలను తిరిగి అదే పోస్టుల్లోకి తీసుకోవడంతో పాటు రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనుంది. జూనియర్ రెవెన్యూ అధికారి పేరుతో ప్రతి గ్రామంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా భూమి సమస్యల పరిష్కారం అవుతాయని అధికారులు చెబుతున్నారు. ధరణి కారణంగా వేలాది మంది భూములు కోల్పోయారని, అందులో జరిగిన తప్పిదాలను గుర్తించి సమస్య పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు ప్రస్తావించారు.




### ఆర్మీ ఆఫీసర్, బ్రిగేడియర్ అమితాబ్ జా మృతి పట్ల

# యూఎన్ జనరల్ సెక్రటరీ నివాళి




న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ఐక్యరాజ్యసమితికి చెందిన పీస్‌కీపింగ్ దళంలో కమాండర్‌గా చేస్తున్న భారతీయ ఆర్మీ ఆఫీసర్, బ్రిగేడియర్ అమితాబ్ జా ఇటీవల ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన మృతి పట్ల యూఎన్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ నివాళి అర్పించారు. సంక్లిష్టమైన సిరియా-ఇజ్రాయిల్ సరిహద్దు సమీపంలో .. యూఎన్ పీస్‌కీపింగ్ ఫోర్స్‌కు అమితాబ్ జా నాయకత్వం వహించారు. యూఎన్ డిస్‌ఎంగేజ్మెంట్ అబ్జర్వర్ ఫోర్స్‌కు తాత్కాలిక కమాండర్‌గా చేశారాయన. అయితే ఆయన ఆకస్మికంగా మృతి చెందడం పట్ల సెక్రటరీ జనరల్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సిరియాలో అసద్ ప్రభుత్వం కూలిన సమయంలో.. యూఎన్డీఓఎఫ్‌కు యాక్టింగ్ ఫోర్స్ కమాండర్‌గా అమితాబ్ చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో డిప్యూటీ ఫోర్స్ కమాండర్‌గా చేరారు. అయితే సిరియాలో సంక్షోభం ఏర్పడిన సమయంలో ఆ దళానికి ఆయన యాక్టింగ్ చీఫ్‌గా చేశారు. యూఎన్‌డీఓఎఫ్ దళాన్ని 1974లో ఏర్పాటు చేశారు. భద్రతా మండలి ఆధ్వర్యంలో ఆ దళం .. ఇజ్రాయిల్, సిరియా సరిహద్దుల్లో కాల్పుల విమరణ చేపట్టేలా చూసుకుంటుంది. యూఎన్డీఓఎఫ్ దళంలో 201 మంది భారతీయ సైనిక సిబ్బంది ఉన్నది. ఆ దళంలో వివిధ దేశాలకు చెందిన 1117 మంది సైనికులు ఉన్నారు.

# నిత్య పెళ్లి కూతురు అరెస్టు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 25:** ఒంటరి పురుషులను ఆకర్షించి పెళ్లి చేసుకున్న తరువాత వారిని దోచుకొని పరారవుతున్న ఓ యువతిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పూనమ్, సంజనా గుప్తా, విమలేశ్ వర్మ, ధర్మేంద్ర ప్రజాపతి నలుగురూ ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో పూనమ్ పెళ్లి కూతరులా, సంజనా ఆమెకు తల్లిలా వ్యవహరిస్తుంది. విమలేశ్, ధర్మేంద్ర ఒంటరి పురుషులు ఎక్కడ ఉన్నారా.. అని టార్గెట్స్ కోసం వెతుకుతారు. టార్గెట్ దొరకగానే అమ్మాయిని చూపిస్తామని, అందుకు రూ. 1.5 లక్షలు ఫీజుగా చెల్లించాలని అంటారు. అవతలి పార్టీ అందుకు ఒప్పుకోగానే పూనమ్, సంజనాల దగ్గరికి తీసుకెళ్తారు. వారు మాట్లాడుకున్న తర్వాత ఇద్దరికి పెళ్లి జరిపిస్తారు. అనంతరం పూనమ్ పెళ్లి కొడుకుతో అతని ఇంటికి వెళ్తుంది. అక్కడ అవకాశం చిక్కేదాక అతనితో కాపురం చేస్తుంది. అవకాశం చిక్కగానే ఆ ఇంట్లోని నగదు, నగలు తీసుకుని పరారవుతుంది. ఇదే క్రమంలో తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లాకు చెందిన శంకర్ ఉపధ్యాయ్ అనే వ్యక్తిని ఈ ముఠా టార్గెట్ చేసింది. విమలేష్, ధర్మేంద్ర అతనితో మాట్లాడి పూనమ్, సంజనాలతో మాట్లాడించారు. అయితే శంకర్ ఉపాధ్యాయ్‌కి వారు తీరుపై అనుమానం కలిగింది. దాంతో రూ. 1.5 లక్షలకు ముట్టజెప్పేందుకు నిరాకరించాడు. దాంతో పూనమ్ ముఠా అతడిని బెదిరించింది. తప్పుడు కేసు పెట్టి జైల్లో వేయిస్తామని హెచ్చరించింది. దాంతో తనకు ఆలోచించుకోవడానికి సమయం కావాలని చెప్పి అతడు అక్కడి నుంచి బయటపడ్డాడు. తర్వాత పోలీసులను ఆశ్రయించాడు. బాందా పోలీసులు ఆ ముఠాను అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు.



# త్వరలో అతిషి అరెస్టు చేసే అవకాశం : కేజ్రీవాల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. త్వరలో ఢిల్లీ సీఎం అతిశీని అరెస్ట్ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేజ్రీ ట్వీట్ పెట్టారు. త్వరలో జరగబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆప్ ప్రభుత్వం రెండు రోజుల క్రితం మహిళా సమ్మాన్ యోజన, సంజీవన యోజన పథకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకాలు ప్రకటిండచం కొందరికి నచ్చలేదని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సీఎం అతిశీని తప్పుడు కేసులో అరెస్ట్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు. అంతకంటే ముందు పలువురు ఆప్ నేతల ఇళ్లలో సోదాలు జరగొచ్చని పేర్కొన్నారు.

# శ్రీతేజను పరామర్శించిన వేణుస్వామి

## తండ్రికి రెండులక్షల సాయం అందచేత

**హైదరాబాద్,డిసెంబర్25 :** పుష్ప 2 చిత్రం ప్రీ రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద చోటు చేసుకున్న తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి.. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను ప్రముఖ జ్యోతిష్యుడు వేణు స్వామి బుధవారం పరామర్శించారు. అనంతరం శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని అతడి తండ్రి భాస్కర్‌ను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ కుటుంబానికి రూ. 2 లక్షల చెక్కును ఆర్థిక సాయాన్ని వేణు స్వామి అందజేశారు. శ్రీతేజ్ ఆరోగ్యం కోసం ఈ వారం రోజుల్లో మృత్యుంజయ హోమాన్ని.. అది కూడా తన సొంత ఖర్చులతో నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

### పార్లమెంట్ సమీపంలో వ్యక్తి

# ఆత్మహత్యాయత్నం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 25:** దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్ భవనం సమీపంలో కలకలం రేగింది. ఓ వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. లోకల్ పోలీసులు, రైల్వే పోలీసులు, స్థానికులు తక్షణమే స్పందించి మంటలను ఆర్పేశారు. అతడిని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఘటనకు పాల్పడిన వ్యక్తి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, బాగ్‌పట్ జిల్లాకు చెందిన జితేంద్రగా గుర్తించారు. పార్లమెంట్ సమీపంలోని రైల్వే భవన్ ఆవం-ణలో బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే జితేంద్ర ఎందుకు అక్కడికి వచ్చి ఆత్మహత్యాయత్నం చేశాడనే వివరాలు తెలియాల్సి ఉంది.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
26 డిసెంబర్
2024



# కీలక పోరుకు సిద్ధమైన టీమిండియా

- ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనున్న భారత్
- గెలవడమే లక్ష్యంగా టీమిండియా వ్యూహాలు
- నేటి నుండి మెల్‌బోర్న్ వేదికగా నాలుగో టెస్ట్



ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. గురువారం నుంచి మెల్‌బోర్న్ వేదికగా జరిగే నాలుగో టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 1-1తో సమంగా నిలిచిన విషయం తెలిసిందే. గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్‌లో టెయిలెండర్ల అసాధారణ ప్రదర్శనతో ఓటమిని తప్పించుకున్న టీమిండియా.. రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఉంది. ఇదే జోరులో బాక్సింగ్ డే టెస్ట్‌లో ఆసీస్‌ను ఓడించాలని భావిస్తోంది. ఈ మ్యాచ్ గెలవడమే లక్ష్యంగా వ్యూహాలు రచించిన టీమిండియా.. తుది జట్టు విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగాలని భావించిన టీమిండియా.. పేస్ ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డిపై వేటు వేయనున్నట్లు ఆసీస్ పర్యటనలో ఉన్న మీడియా ప్రతినిధులు వెల్లడించారు. బౌలింగ్‌లో అంతగా ప్రభావం చూపలేకపోతున్న నితీష్ కుమార్ రెడ్డి స్థానంలో వాషింగ్టన్ సుందర్‌ను ఎక్స్‌ట్రా స్పిన్నర్‌గా తీసుకోవాలని టీమిండియా మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. నితీష్ కుమార్ రెడ్డి బ్యాట్‌తో పర్వాలేదనిపించినా.. బౌలింగ్‌లో తేలిపోయాడు. దాంతో బౌలింగ్ విభాగం బలహీనంగా మారిపోయింది. మరో స్పిన్నర్‌గా రవీంద్ర జడేజా కొనసాగనున్నాడు. మెల్‌బోర్న్ టెస్ట్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కారణాలతో రోహిత్ తొలి టెస్ట్‌కు దూరం కాగా.. అతని గైర్హాజరీలతో కేఎల్ రాహుల్ రాణించాడు. దాంతో రెండో టెస్ట్‌కు రోహిత్ అందుబాటులోకి వచ్చినా.. రాహుల్‌నే ఓపెనర్‌గా కొనసాగించారు. అతని కోసం రోహిత్ శర్మ మిడిలార్డర్‌లో ఆడాడు. కానీ గత రెండు టెస్ట్‌ల్లో అతను దారుణంగా విఫలమయ్యాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు.

ఈ క్రమంలోనే రోహిత్ శర్మను మళ్లీ ఓపెనర్‌గా బరిలోకి దించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రోహిత్ ఓపెనర్‌గా బరిలోకి దిగితే కేఎల్ రాహుల్ ఫస్ట్ డౌన్‌లో ఆడనున్నాడు. శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో బ్యాటింగ్ చేసే ఛాన్స్ ఉంది. పేసర్లుగా జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్ కొనసాగే ఛాన్స్ ఉంది. సిరాజ్‌ను పక్కనపెట్టాలని భావిస్తే హర్షిత్ రాణా తుది జట్టులోకి వస్తాడు. మరోవైపు తొలి టెస్టులో బుమ్రా అత్యుత్తమ ప్రదర్శన వల్లే భారత్ నెగ్గింది. ఆ మ్యాచ్‌లో బుమ్రాకు మిగతా బౌలర్ల నుంచి కాస్త సహకారం లభించింది. కానీ, రెండో టెస్టులో హెడ్‌ను భారత్ ఆపలేకపోయింది. ఓ ఎండ్‌లో బుమ్రా ఒత్తిడి పెంచినప్పటికీ, మిగతా బౌలర్లు రాణించలేకపోయారు. ఇక మన బ్యాటర్లూ విఫలమవడం వల్ల ఆ మ్యాచ్‌లో భారత్‌కు ఓటమి తప్పలేదు. ఇక గబ్బా టెస్టులో బుమ్రాది ఒంటరి పోరాటమే. బ్యాటర్లూ తేలిపోయారు. మిగతా బౌలర్లూ చేతులెత్తేశారు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో అతడు ఓ వైపు వికెట్లు పడగొడుతూన్నా, మరోవైపు నుంచి ఏ బౌలర్ కూడా కనీసం ప్రభావం చూపలేదు. ఆస్ట్రేలియా కోల్పోయిన తొలి 6 వికెట్లలో 5 బుమ్రానే పడగొట్టం విశేషం. ఆసీస్ బ్యాటర్లు బుమ్రా బౌలింగ్?లో భారీ షాట్లకు పోకుండా జాగ్రత్తగా ఆడుకుంటూ, మిగత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. దీంతో ఆసీస్? తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ సాధించింది. అయితే ఆ మ్యాచ్‌లో వర్షం కలిసొచ్చి మ్యాచ్ డ్రా గా ముగిసింది. దీంతో సిరీస్ 1-1తో సమంగా ఉంది. కాగా, మెల్‌బోర్న్ వేదికగా జరగనున్న నాలుగో మ్యాచ్‌లో పేస్‌కు అనుకూలించే పిచ్‌ను బుమ్రా బౌలింగ్ దళం ఎలా ఉపయోగించుకుంటుందన్నది కీలకం. బుమ్రా ఉత్తమ ప్రదర్శన చేస్తాడనడంలో ఎవరికీ డౌట్ లేదు. అయితే మిగతా పేసర్లు మరో ఎండ్‌లో అతడిని సహకరిస్తే, ఆసీస్ బ్యాటర్లకు చెక్ పెట్టొచ్చు. ముఖ్యంగా హెడ్?ను కంట్రోల్ చేయాలి. అతడిని మాటలతో రెచ్చగొడుతున్న సిరాజ్, బౌలింగ్?లో మాత్రం ప్రభావం చూపట్లేదు. అయితే మెల్‌బోర్న్ పిచ్ అతడికి సహకరించవచ్చు. ఇక్కడ అతడు విజృంభిస్తే భారత్‌కు తిరుగుండదు. ప్రస్తుత సిరీస్?లో బుమ్రా 21 వికెట్లతో టాప్?లో కొనసాగుతుండగా, మిగిలిన టీమ్ఇండియా బౌలర్లలో 3 మ్యాచ్‌ల్లో సిరాజ్ 13 వికెట్లు, 2 మ్యాచ్‌ల్లో హర్షిత్ రాణా 4 వికెట్లు, ఒక మ్యాచ్ ఆడిన ఆకాశ్ దీప్ 2 వికెట్లు పడగొట్టాడు. అంటే ఈ ముగ్గురి వికెట్లు కలిపినా 19 మాత్రమే అవుతాయి. దీన్ని బట్టే బుమ్రా టీమ్ఇండియాకు ఎంత కీలకంగా మారాడో అర్థం చేసుకోవచ్చు. అయితే టీమ్ఇండియా బౌలింగ్ దళంలో అతడికి సహకారం కరవైంది. జట్టులో మిగతా బౌలర్ల నుంచి బుమ్రాకు ఎలాంటి సహకారం అందడం లేదు. మరి సిరీస్ గమనాన్ని నిర్దేశించే నాలుగో టెస్టులో అయినా సహచర బౌలర్లు పేస్ దళపతికి అండగా నిలుస్తారా? అనేది అభిమానల్లో ఆందోళన కలిగిస్తోంది.

**బాక్సింగ్ డే టెస్ట్ కోసం భారత తుది జట్టు(అంచనా)**

యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా/మహమ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా .



## నా రిటైర్మెంట్‌కు ఎవరూ బాధ్యులు కాదు : అశ్విన్

ఎన్నో మ్యాచుల్లో టీమ్ఇండియా విజయాల్లో కీలకపాత్ర పోషించిన రవిచంద్రన్ అశ్విన్ ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లిన అతడు ఘనమైన వీడ్కోలు లేకుండానే సిరీస్ మధ్యలోనే రిటైర్మెంట్ ప్రకటించాడు. గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్టు డ్రాగా ముగిసిన తర్వాత అశ్విన్ ఈ నిర్ణయాన్ని వెల్లడించాడు. అతను ఉన్నట్టుండి రిటైర్మెంట్ ప్రకటించడం అందరిని షాక్‌కు గురిచేసింది. కపిల్‌దేవ్ వంటి మాజీ క్రికెటర్లు అశ్విన్‌కు ఘన వీడ్కోలు పలికితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అశ్విన్ తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌తో మాట్లాడాడు. తన అంతర్జాతీయ కెరీర్ గురించి ఎలాంటి విచారం లేదని, గొప్ప వీడ్కోలు వంటి అంశాలపై నమ్మకం లేదన్నాడు. 'ఘనమైన వీడ్కోలు అనే కాన్సెప్ట్‌కు నేను వ్యతిరేకం. ఎవరికీ ఇలాంటి వేడుకలు నిర్వహించాలని నేను అనుకోను. ముఖ్యంగా మీరు నాకు గొప్ప వీడ్కోలు ఇవ్వకూడదని నేను గట్టిగా నమ్ముతున్నాను. నా కోసం ఎవరు కూడా కన్నీటి చుక్క రాల్చొద్దు. గ్రాండ్ సెండ్ ఆఫ్‌లు అనేవి సూపర్ సెలబ్రిటీ సంస్కృతిలో భాగమని భావిస్తున్నాను.ఒకరి వెనుక మనం ఎందుకు పరుగెత్తాలి? ఒకరిపై మనకున్న ప్రేమ కోసం మనం ఎవరి వెనుక పరుగెత్తుతున్నామో నాకు అర్థమైంది. కానీ ఒకరు సాధించిన విజయాలు, వారి వారసత్వం, ఆట నుంచి నిష్క్రమించిన విధానం, ఆట గురించి మాట్లాడిన విధానం ద్వారా ప్రజలు ప్రేరణ పొందాలని భావిస్తున్నాను. కానీ, వీడ్కోలు అనేది తప్పు అనుకుంటున్నా. కేవలం నన్ను సెలబ్రేట్ చేసుకునేందుకే ఏదైనా మ్యాచ్ నిర్వహిస్తే అది ఆటకు మంచికాదని నా భావన. నా కెరీర్ గురించి ఎలాంటి బాధ లేదు. 537 వికెట్లు తీసి కూడా సంతోషంగా లేకపోతే మరి దానికి హ్యాపీగా ఫీల్ అవ్వాలి. లేని దాని గురించి నేనెందుకు బాధపడాలి?అని అంగీకరించడంలో గొప్ప ఆనందం ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌కు మాత్రమే వీడ్కోలు పలికా. క్రికెట్ గురించి మాట్లాడతాను. నేను యూట్యూబ్‌లో చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తా. కోచింగ్ ఇష్టపడతా. రిటైర్మెంట్ విషయంలో నాకేలాంటి బాధలేదు.ఎవరిపైనా కోపం లేదు. వీడ్కోలు నిర్ణయం తర్వాత ఒక్కసారి కూడా ఏడవలేదు. నా రిటైర్‌మెంట్‌కు ఎవరూ బాధ్యులు కాదు. ఎవరైనా ఉన్నట్లయితే, దాని గురించి నాకు తెలియదు' అని అశ్విన్ పేర్కొన్నాడు.

# టీమ్ఇండియా మహిళల విజయఢంకా

- వెస్టిండీస్‌తో రెండో వన్డేలో భారత్ విజయం
- యంగ్ బ్యాటర్ హర్లీన్ డియోల్ సూపర్ సెంచరీ
- మూడు వన్డేల సిరీస్ భారత్ వశం

వెస్టిండీస్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమ్ఇండియా మహిళలు వరుసగా రెండో విజయం నమోదు చేశారు. రెండో వన్డేలో భారత్ ఏకంకా 115 పరుగుల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 358-5 స్కోర్ నమోదు చేసింది. ఇక భారీ లక్ష్య ఛేదనలో విండీస్ కూడా పోరాడింది. 46.2 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ హేలీ మ్యాథ్యూస్ (106 పరుగులు) సెంచరీతో రాణించినా, మిగతా బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. టీమ్ఇండియాలో ప్రియా మిశ్ర 3, దీప్తి శర్మ, టిటాస్ సాధు, ప్రతికా తలో 2, రేణుకా సింగ్ 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 358-5 పరుగులు చేసింది. యంగ్ బ్యాటర్ హర్లీన్ డియోల్ (115 పరుగులు, 103 బంతుల్లో 16 ఫోర్లు) సూపర్ సెంచరీ సాధించింది. మూడో స్థానంలో వచ్చిన హర్లీన్ బౌలర్లపై విరుచుకుపడింది. ఎడాపెడా బౌండరీలు బాదేసి విండీస్ బౌలర్లను బెంబేలెత్తించింది. ఓపెనర్లు స్మృతి మంధాన (53 పరుగులు: 47 బంతుల్లో), ప్రతీకా రావల్ (76 పరుగులు, 86 బంతుల్లో), జెమీమా రోడ్రిగ్స్ (52 పరుగులు, 36 బంతుల్లో) ముగ్గురు హాఫ్ సెంచరీలతో రాణించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (22 పరుగులు) పరుగులు చేసింది. దీంతో భారత్ భారీ స్కోర్ సాధించింది. అయితే వన్డేల్లో భారత్ 350కిపైగా స్కోరు చేయడం ఇది రెండోసారి. 2022లో ఐర్లాండ్‌పై కూడా సరిగ్గా 358-5 స్కోరు చేసింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో దక్కించుకుంది. తొలి మ్యాచ్‌లో భారత్ 211 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. కాగా,



డిసెంబర్ 27న ఇరుజట్ల మధ్య వడొదర వేదికగా మూడో వన్డే జరగనుంది.



## శాంతాక్లాజ్ వేషధారణలో ధోనీ


ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. సెలబ్రిటీలు కూడా క్రిస్మస్ సెలబ్రేషన్స్ చేసుకుంటున్నారు. భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కూడా తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సంబరాలు చేసుకున్నాడు. ధోనీ భార్య సాక్షి, కూతురు జీవా, బాలీవుడ్ నటి కృతిసనన్, కబీర్ బహియా తదితరులు ఈ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నారు. ధోనీ శాంతాక్లాజ్ వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. మిగతా వాళ్లు శాంతాక్లాజ్‌లాగా టోపీలు ధరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సాక్షి సోషల్ మీడియాలో పంచుకుంది. వాటిని చూసిన నెటిజన్లు శాంతాక్లాజ్ గెటప్‌లో ధోనీ క్యూట్‌గా ఉన్నాడని కామెంట్లు పెడుతున్నారు.

## పంత్ పరిస్థితుల్ని గౌరవించడం నేర్చుకోవాలి

### దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సూచన



టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ పరిస్థితుల్ని గౌరవించడం నేర్చుకోవాలని దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సూచించాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమిండియా.. మూడు టెస్ట్‌లు ముగిసే సరికి 1-1తో సమంగా నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టెస్ట్ మెల్‌బోర్న్ వేదికగా గురువారం నుంచి ప్రారంభం కానుంది. తొలి మూడు మ్యాచ్‌ల్లో రిషభ్ పంత్ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. ఈ క్రమంలోనే అతనికి గవాస్కర్ పలు సూచనలు చేశాడు. 'రిషభ్ పంత్ పరిస్థితులను గౌరవించడం నేర్చుకోవాలి. అతని ఆట దూకుడుగానే ఉంటుంది. ఈ విషయం నేను కాదనను. కానీ క్రీజులోకి వచ్చిన తొలి అరగంట పాటు పరిస్థితుల్ని, మంచి బంతుల్ని గౌరవించాలి. పంత్ బ్యాటింగ్‌కు వచ్చే సరికి భారత్ 500 పరుగులు దాటేసి ఉంటే ఆరంభంలోనే దూకుడుగా ఆడటం తప్పు కాదు. కానీ క్రీజులోకి అడుగుపెట్టినప్పటి నుంచే ప్రతీ బంతిని బాదాలనే రీతిలో బ్యాటింగ్ చేయకూడదు. ప్యాట్ కమిన్స్, జోష్ హజెల్ వుడ్ అతన్ని ఇబ్బంది పెట్టారు. స్కాట్ బోలాండ్ సైతం పంత్‌ను కుదురుకోనివ్వలేదు. అరౌండ్ బాల్స్‌తో ఇబ్బంది పెట్టాడు.'అని సునీల్ గవాస్కర్ చెప్పుకొచ్చాడు. మొత్తం ఐదు ఇన్నింగ్స్‌ల్లో రిషభ్ పంత్ 19.20 సగటుతో 96 పరుగులే చేశాడు. మరోవైపు ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హెడెన్ మాత్రం రిషభ్ పంత్ తన ఫియర్‌లెస్ గేమ్‌ను కొనసాగించాలని సూచించాడు.



## ఐసీసీ ర్యాంకింగ్స్.. అశ్విన్ రికార్డును సమం చేసిన బుమ్రా

బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో అదరగొడుతున్న భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్న అతను గబ్బా టెస్టులో తొమ్మిది వికెట్లు పడగొట్టి తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. ఈ వారం విడుదల చేసిన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో బుమ్రా (904) రేటింగ్ పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. ఈ క్రమంలోనే టెస్టుల్లో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత బౌలర్‌గా అశ్విన్ రికార్డును బుమ్రా సమం చేశాడు. ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించిన రవిచంద్రన్ అశ్విన్ డిసెంబరు, 2016లో ఈ ఘనత సాధించాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా నాలుగు స్థానాలు దిగజారి 10వ ర్యాంక్‌కు పడిపోయాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. ఇంగ్లాండ్ బ్యాటర్లు జో రూట్ (895), హ్యారీ బ్రూక్ (876) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. కేన్ విలియమ్సన్ (867) మూడో స్థానంలో కొనసాగుండగా.. భారత్‌పై వరుస శతకాలతో విరుచుకుపడుతున్న ఆసీస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ (825) ఒక స్థానం ఎగబాకి నాలుగో ర్యాంకులో నిలిచాడు. యశస్వి జైస్వాల్ (805) ఒక స్థానం డౌన్ అయి ఐదో ర్యాంకు, రిషభ్ పంత్ (708) రెండు స్థానాలు దిగజారి 11వ ర్యాంక్‌కు పరిమితమయ్యారు. శుభ్‌మన్ గిల్ (652) నాలుగు స్థానాలు పడిపోయి 20వ ర్యాంక్, విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి 21వ ర్యాంక్‌లో నిలిచారు. రోహిత్ శర్మ ఐదు స్థానాలు డౌన్ అయి 35వ స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇప్పటివరకు మూడు టెస్టులు జరిగాయి. ఈ మూడు మ్యాచ్‌ల్లో 21 వికెట్లు పడగొట్టాడు. గురువారం నుంచి మెల్‌బోర్న్ వేదికగా నాలుగో (బాక్సింగ్ డే) టెస్టు ప్రారంభం కానుంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News






## సమంత ఇంకా దూరం దూరం..!

సౌత్ స్టార్ హీరోయిన్స్ లో ఒకరైన సమంత ఇప్పుడు ఆ సౌత్ ఇండస్ట్రీకి దూరమై పూర్తిగా బాలీవుడ్ లోనే సినిమాలు చేయాలని భావిస్తుందని తెలుస్తుంది. తెలుగు, తమిళ్ లో స్టార్ డం కొనసాగించిన సమంత ఇక మీదట తన కెరీర్ అంతా కూడా బాలీవుడ్ లోనే అని అనేస్తుందట. సౌత్ లో ఇక సినిమాలు చేయడం కష్టమే అని అన్నట్టు చెబుతుంది. దీనికి కారణం సౌత్ లో చేస్తే సినిమాలు చేయాలి లేదంటే లేదు. కానీ బాలీవుడ్ లో అయితే సినిమాలే కాదు వెబ్ సీరీస్ లతో కూడా అలరించే ఛాన్స్ ఉంటుంది.

సమంత చేసిన రెండు బాలీవుడ్ సీరీస్ లు కూడా గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. రాజ్ అండ్ డీకేతో చేతులు కలిపి సమంత చేసిన మొదటి వెబ్ సీరీస్ ఫ్యామిలీ మ్యాన్ 2 సూపర్ సక్సెస్ కాగా కొద్దిపాటి గ్యాప్ తర్వాత సమంత చేసిన సిటాడెల్ హనీ బన్నీ కూడా సూపర్ హిట్ అయ్యింది. బాలీవుడ్లో సక్సెస్ అంటే అది సినిమాల వల్లే కాదు వెబ్ సీరీస్ లతో కూడా పొందే ఛాన్స్ ఉందని కనిపెట్టిన సమంత ఇక మీదట అక్కడే వరుస వెబ్ సీరీస్ లను చేయాలని ఫిక్స్ అయ్యింది. ఈ క్రమంలో తెలుగు నుంచి ఆఫర్లు వచ్చినా కూడా చేయడానికి ఆమె సుముఖంగా లేదని తెలుస్తుంది. సమంత ని ఆమె సౌత్ ఫ్యాన్స్ ఎంతో మిస్ అవుతున్నా కూడా తనకు నచ్చే కథ దొరికే వరకు ఇక్కడ సినిమాలు చేయడం కష్టమని తెలుస్తుంది. ఒకవేళ బాలీవుడ్ లో వరుస ప్రాజెక్ట్ లతో బిజీ అయితే మాత్రం తెలుగు, తమిళ పరిశ్రమల నుంచి ఆఫర్లు వచ్చినా కూడా చేయడం కష్టమవుతుంది. సమంత నిర్మాతగా మా ఇంటి బంగారం సినిమా అనౌన్స్ చేసింది. ఐతే అది ప్రకటించి ఏడాది పైన అవుతున్నా కూడా ఆ సినిమా గురించి ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. అందుకే సమంత సౌత్ సినిమాలకు దూరం దూరంగా బాలీవుడ్ కి దగ్గర దగ్గరగా ఉందనిపిస్తుంది. ఈమధ్య అమ్మడు ఎక్కువగా ముంబైలోనే స్పెండ్ చేస్తుంది. చూస్తుంటే అటు ఇటు తిరగలేక పూర్తిగా ముంబై షిఫ్ట్ అయిపోయినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదని చెప్పొచ్చు. ఐతే అలా చేస్తే మాత్రం సమంత సౌత్ ఫ్యాన్స్ చాలా హర్ట్ అవుతారు.



## ఇలా చేస్తే ఎలా కీర్తి
## కీర్తి ఆఫర్‌కు అభిమాని ఫిదా..

కీర్తి సురేష్-వరుణ్ ధావన్ జంటగా నటించిన 'బేబీ జాన్' చిత్రం బుధవారం (డిసెంబర్ 25) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సౌత్‌లో స్టార్ హీరోయిన్ హెూదా తెచ్చుకున్న కీర్తి సురేష్ చేసిన తొలి బాలీవుడ్ చిత్రం ఇదే కావడం విశేషం. దీంతో కీర్తి సురేష్ ఫ్యాన్స్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఈ సినిమా కోసం ఎదురుచూశారు. అందులోనూ ఇప్పటికీ ఈ సినిమాలోని 'నైన్ మాటక్క' సాంగ్ బాగా వైరల్ అయింది. సోషల్ మీడియా ఓపెన్ చేస్తే చాలు ఈ పాటే కనిపిస్తుంది. ఈ చిత్రం ప్రమోషన్స్ కోసం వరుణ్ ధావన్‌తో కలిసి కీర్తి సురేష్ ముంబై మొత్తం చుట్టేసింది. పలు టీవీ షోలకి కూడా వెళ్లింది. ఇటీవల ఫేమస్ కపిల్ శర్మ షోలో కూడా కీర్తి సురేష్ సందడి చేసింది. ఆ షోకి సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కీర్తి సురేష్‌తో మాట్లాడేందుకు ఓ ఫ్యాన్ స్టేజ్ మీదకి వచ్చాడు. అతని హెయిర్ చూసి ఏది ఇలా చెయ్ అంటూ రజినీ కాంత్ స్టయిల్లో జుట్టు ఎగరేసింది కీర్తి. సేమ్ అలానే ఆ ఫ్యాన్ కూడా చేశాడు. దీంతో ఎంత స్టయిల్‌గా ఉంది అంటూ కీర్తి అనగానే ఆ అభిమాని తెగ సిగ్గుపడిపోయాడు. చూడు చూడు ఎంత సిగ్గుపడుతున్నాడో అంటూ మరో హీరోయిన్ వామికా గబ్బి అంది. దీనికి మరి ఫ్యాన్ కదా ఆ మాత్రం ఉంటుంది అంటూ ఆ అభిమాని అన్నాడు.

## స్టార్ హీరోయిన్ స్టన్నింగ్ లుక్ వైరల్

శ్రీలంకన్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ పరిచయం అవసరం లేదు. ఇటీవల కొన్ని వివాదాలతో ఈ బ్యూటీ పేరు నిరంతరం హెడ్ లైన్స్ లోకొచ్చింది. తనకు 2024 తీపి చేదుగుళికల మిశ్రమం. మరోవైపు లక్షలాది మంది ఫాలోవర్స్ తో సోషల్ మీడియాల్లో టాప్ స్టార్ గా వెలిగిపోతోంది జాకీ. ఇంతకుముందు ప్రభాస్ %-%సాహెూ%-%లోను జాక్వెలిన్ ప్రత్యేక గీతంలో నర్తించింది. ప్రస్తుతం ఈ బ్యూటీ బాలీవుడ్ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అక్షయ్ కుమార్ %-%హౌస్ ఫుల్ 5%-% చిత్రంలోను ఈ బ్యూటీ నటిస్తోంది. ఇప్పుడు నటుడు సోనూసూద్ దర్శకత్వం వహించిన తొలి చిత్రం %-%ఫతే%-%లో నటించింది. ఇది సోనూ, జాకీ ఇద్దరికీ కొత్త ఎత్తులకు తీసుకెళ్లే హై ఆక్టేన్ యాక్షన్ చిత్రం అని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ సోమవారం ఆవిష్కరించారు. ఇందులో జాక్వెలిన్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలలో జాక్వెలిన్ ఎనర్జీ అందరి దృష్టిని ఆకర్షించింది. ట్రైలర్ లాంచ్‌లో మాట్లాడుతూ, జాక్వెలిన్ తన సహనటుడు, దర్శకుడు సోనూతో కలిసి పనిచేసిన అనుభవం గురించి వెల్లడించింది. కథ విన్నప్పుడే సోనూ కళ్లలో నాపై చాలా నమ్మకం కనిపించింది. దర్శకుడిగా అతడి అభిరుచిని చూశాను. అందుకే ఈ చిత్రం చేయాలని భావించాను అని జాక్వెలిన్ గుర్తుచేసుకుంది. చాలా ఫ్రెష్ గా ఉండే పాత్రలో నటించాను. ఈ సినిమా కథనం చాలా శక్తివంతంగా ఉంటుందని కూడా జాకీ చెప్పింది. సోనూ సూద్‌తో కలిసి పని చేయడం అద్భుతమైన శక్తిని ఇచ్చిందని దర్శకుడిగా అతడు చక్కని పాత్రను పోషించాడని కూడా కితాబిచ్చింది. సోను దర్శకత్వంలో నటించడం చాలా భిన్నమైన అనుభవం. నాలో ఉన్న బెస్ట్ ని బయటకు తీసుకురావడానికి నిబద్ధతతో పని చేసాడని జాకీ ప్రశంసించింది. దర్శకుడు అంతగా విశ్వసించినప్పుడు, వారు ఏం కోరుకుంటున్నారో దానిపై స్పష్టత ఉన్నప్పుడు, అది చేసే పనిని సులభతరం చేస్తుందని జాక్వెలిన్ వెల్లడించింది. ఫతేహ్ జనవరి 10న విడుదల కానుంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986